
# యుగసంధి

పెద్దకథ

ముఖమంతా నోరేనేమోననిపించేలా వ్యాకోచిస్తున్న పెదవుల్లోంచీ పిచ్చిపట్టిన కుక్కపిల్ల ఆక్రోశంలాంటి వింత శబ్దమొకటి ప్రసారమవుతుండగా పెద్దగా ఆవులిస్తూ ఇంకా సిమెంటుపూతను కప్పుకోని ఇటుకరాళ్ల వరండాలోకొచ్చి నిల్చున్నాడు పాలకూరు సుబ్బయ్య. తడిసిన మఫ్లర్ని తలపైన్నుంచీ తప్పించి, రుమాలుతో ముఖం తుడుచుకుంటూ ప్రసాదరెడ్డి బంగళావైపు కోసారి చూపుల్ని మరల్చాడు.

పలచటి చినుకుల పరదాకవతల, చీకటిపరదాల మధ్య వొంటరి ఆసుపత్రి భవనంలా బిక్కుబిక్కుమంటూ వుంది ప్రసాదరెడ్డి బంగళా. ఇంటిచుట్టూ వున్న చెట్లు సైతం చీకటి ముసుగుల్ని కప్పుకోవడంతో అదెంత పెద్దఇల్లో




తెలియడంలేదు. దాదాపు కిలోమీటరు దూరంలో వున్న నగరపు దీపాలు చెలరేగిన మిణుగుర్ల గుంపులా కనిపిస్తున్నాయి. ఫర్లాంగు దూరానికవతలున్న శివారు కాలనీ దీపాలు మొసలిగుడ్లలా కువ్వలుకువ్వలుగా కనిపిస్తున్నాయి. పదిబారలకవతలున్న గ్రాండ్ టంక్‌రోడ్డుపైన తలలకు దీపాల్ని తగిలించుకున్న గని పనిమనుషుల్లాంటి వాహనాలు కారుబారు చేస్తున్నాయి. తాను నిల్చున్న చోటుల్లోంచీ బంగళాలో దీపం వెలుగుతున్న ఏకైక గది కిటికీకేసి చూసీ చూడగానే సుబ్బయ్య వులిక్కిపడ్డాడు. అద్దాల కిటికీపైన పడుతున్న పలచటి దీపపుకాంతికి దట్టంగా అడ్డంపడుతున్న నీడ ఎవరిదో అతడికి వెంటనే స్ఫురించింది. వెనకవైపున గుప్పెడు వెంట్రుకలు మాత్రమే మిగిలిన ప్రసాదరెడ్డి బట్టతలతోబాటూ చీకిపారేసిన తాటిముట్టె కూడా అతడికి జ్ఞాపకం వచ్చింది. కంగారుపడుతూ తాను నిల్చున్న ఇంటికేసి తిరిగాడతను. ప్రసాదరెడ్డి బంగళా అనే చీకటి గుయ్యారానికి క్రీనీడలా దానికి ఆనుకునే వుంది ఆ ఇల్లు. నీళ్లతో తడిపిన సిమెంటు గోడలతో తడితడిగా వున్నాయి గోడలు. తలుపులూ కిటికీలు చోటుచేసుకోబోయే స్థలాల్లో పెద్ద పెద్ద ఖాళీలతో అప్పుడే తోలు తీసేసిన కళేబరంలా భీకరంగా కనిపిస్తోంది ఆ ఇల్లు.

యథాలాపంగా ఇంటి లోపలికి అడుగుపెట్టగానే మరోసారి ఉలిక్కిపడ్డాడు సుబ్బయ్య. పట్టపగల్లా వెలుగుతున్న విద్యుద్దీపపు కాంతిలో, రొచ్చు రొచ్చుగా పడివున్న సిమెంటు డాగులమధ్య పాత కుక్కిమంచంపైన పడుకున్న ఆకారాలు రెండూ అతడి రాకను గమనించనేలేదు. గోడవైపుగా పడుకున్న ముప్పయ్యేళ్ల ఆడమనిషి తలంతా రేగిపోయి వుంది. కొప్పులోని చెండుమల్లి పూలరేకులు

మధురాంతకం నరేంద్ర

# గురజాడ వీధి



చీకటి, చినుకులు, వడగండ్లు ఈదురుగాలులు కలిసి నేసిన చిక్కటి తివాచీని రెండుగా కత్తిరిస్తున్నట్టుగా ఒంటరి దీపమొకటి ఇంటివేపుకు మెల్లగా పరతెంచి వస్తోంది.

ఆమె నల్లటి ముఖంపైని చెమటలో అతుక్కుపోయి వున్నాయి. వాకలిబండకు అతుక్కుపోయిన గుడ్డపేలికలా జాకెట్టు ఆమె శరీరానికంటుకుపోయివుంది. నడుముకు చుట్టుకున్న పాత లుంగీ . మినహా మరో అచ్ఛాదనలేని మగమనిషి నల్లటి శరీరం తుప్పపట్టిన ఇనపస్తంభంలా కనిపిస్తోంది. ఈదురుగాలులు ఈడ్చి కొడుతున్నా అతడి ముఖంపైన చెమటబిందువులు పొటమరించే వున్నాయి.

ఒక అడుగు ముందుకేసి మరోసారి వాళ్లిద్దరినీ అనుమానంగా చూశాడు సుబ్బయ్య. చాచిన అతడి జబ్బపైన ఆమె తలా, చీర తొలగిన ఆమె మోకాలిపైన అతడి పాదమూ మోపుకుని వున్నాయి. జీరంగి గీపెడుతున్నట్టుగా వినిపిస్తున్న అతడి గురకను సైతం నరకుచేయకుండా ఆమె నిద్రపోతోంది.

అయిదు నిముషాలసేపు కళ్లార్పడం కూడా మరచిపోయి నిల్చుండిపోయాడు సుబ్బయ్య. వేగంగా వీస్తున్న గాలికి పెరట్లోని డబ్బారేకులేవో

డబడబలాడుతున్నాయి. దూరంనుంచీ పామునోట్లో చిక్కుకున్న బావురుకప్ప గాండ్రింత.అసహ్యంగా వినిపిస్తోంది. పిచ్చివాడి చేతి వాయిద్యాల్లా కీచురాళ్లు కయ్యిమంటున్నాయి.

మెడపైన ఇంజెక్షను వేసినట్టుగా కుట్టిన దోమను గట్టిగా అరిచేతితో చరిచాడు సుబ్బయ్య. గది మూలలో తోక ముడుచుకుని పడుకున్న కుక్కపిల్ల తలపైకెత్తి చూసింది. మరోవైపు తాబేలులా ముడుచుకుని పడుకున్న కోడిపెట్ట తలమాత్రం పైకెత్తి చూసి, మళ్లీ తన మామూలు భంగిమలోకి వెళ్లిపోయింది. పెద్దగా గుర్రంలా సకిలించాడు సుబ్బయ్య. మంచంపైన పడుకున్న స్త్రీ, పురుషులిద్దరూ వులకలేదు. "థూ! పోబయటికి ..." అంటూ పెద్ద మట్టిపెళ్లను చేతికందుకుని కుక్కపిల్లకేసి విసిరాడతను. అది గొల్లుమని గీపెడుతూ దౌడుతీసింది.

చేతిలోని పొడవాటి వెదురుకట్టెతో మంచంబద్దెపైన పెద్దగా బాదుతూ "రేయ్ సంజీవీ! మేయ్, మూలస్థానమ్మా! ధూము తగిలినట్టుగా అప్పుడే నిద్దెట్ల తన్నుకొచ్చింది మీకు! లెయ్యండి పైకి ..." అంటూ గావుకేకలు పెట్టాడు సుబ్బయ్య.

మూలస్థానమ్మ బలవంతంగా కళ్ళు విప్పి చూసి, విసుగ్గా పెదవులు చప్పరించి, పెద్దగా మూలుగుతూ మళ్లీ కళ్లుమూసుకుంది. సంజీవి మాత్రం మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా తెరిచి పెట్టుకుంటూ పైకిలేచి కూర్చున్నాడు.


"ఇదేనా మీరు చేసే వాచ్‌మెన్ దూటీ? యాడ సామాన్లు ఆడే పడుండాయి. యెవుడైనా వచ్చి చేతికి దొరికింది జవురుకోనిపోయినా అడిగే దిక్కూ దివాణమూ లేదు. ఏమైనా జరిగితే రేప్పొద్దన జబాబు చెప్పాల్సిందెవురు? మీరా, నేనా?" అంటూ సుబ్బయ్య పెద్దగా రొప్పసాగాడు.

సంజీవి కడవలోంచీ నీళ్లు ముంచుకుని గుటగుటా శబ్దం చేస్తూ చెంబుడు నీళ్ళు తాగేశాడు. పంచె రొంపిలోంచీ బీడీ పైకి తీసి వెలిగించుకుంటూ మంచంపైకొచ్చి కూర్చున్నాడు.

సుబ్బయ్య నిలువునా వూగిపోతూ "నేను అడిగేదేందీ, నువ్వు చేసేదేందీ? దినదినానికీ మీకు కండ్లు నెత్తిమీదకొచ్చేస్తావుండాయి. కన్నూమిన్నూ కనపడటంలేదు. పోతేపోనీ అని ధర్మానికి పోతావుంటే మీకు యెకసెక్కంగా వుండాది..." అంటూ రంకెలేయసాగాడు.

తాపీగా సగం బీడీ తాగిన తర్వాత "అయితే ఈ పొద్దు కూడా మామందూరుకు పోయిరాలేదాన్నా?" అన్నాడు సంజీవి పదాలు కూడబలుక్కున్నట్టుగా.

"అది నీ కనావస్యం. నీ కతేందో నువ్వు చూసుకో ..." చిత్రంగా చేతులు తిప్పుతూ నాట్య భంగిమలా నిల్చుని సుబ్బయ్య పాదించసాగాడు. "ఈ




మాదిరిగా వొళ్లు తెలియకుండా నిద్రపోతే, దొంగతనం జరిగితే, రేప్పొద్దన ఏ ముఖం పెట్టుకోని తిరగతావు నువ్వు? ఇప్పుడయిన యాస్కాలు చాల్లేదా? ఇంకా జాంబండి కూడా పోలేదు. నిన్న పెద్దరెడ్డి ఏంజెప్పినాడు? ఈ రెండుమూడు దినాలు కంటిమింద రెప్పెయ్యకుండా కాపలాగాయమన్నాడా లేదా జెప్పు! పోలీసులు కూడా వార్నింగిచ్చినారా లేదా? పోయిన తడవ దోపిడీ జరిగినప్పుడెంత ఆగమయిందో అప్పుడే మరిచిపోయినారా? బంగళాలో పెదరెడ్డీ, ఆయిన పెళిడ్లామూ మాత్రమే వుండారు. వాళ్ల కొడుకులిద్దరూ హైద్రాబాదులోనే వుండిపోయినారు. ఇట్లాంటప్పుడు ఆదమరచి నిద్రపోవచ్చునా? ..."

"వూరికే గొంతు నొప్పివుట్టేటట్టుగా అరస్తావుండావేందన్నా! కొంచుం కండ్లు తెరిచి పెద్దరెడ్డి ఇంటిపక్కకోసారి జూడు. ఇనప్పెట్టెమాదిరుంతాదో లేదో చెప్పు..." అన్నాడు సంజీవి మెల్లగా.

ఆరడుగుల పొడవున్న బండరాళ్ల ప్రహరీగోడ. ముఖద్వారాన్ని రక్షిస్తూ గ్రిల్‌గేటు. ఎక్కడ ఏ గది వుందో తెలియనివ్వకుండా ఫహరా కాస్తున్న చీకటి. ఇంటిలోపల వెలుగుతున్న ఏకైక దీపవు కాంతినంతా పీల్చేస్తున్నట్టున్న బట్టతల వ్యక్తి నీడ.

"గుబురుగా చెట్లుంటే అదుపుతప్పిపోతిందని పెద్ద పెద్ద చెట్లన్నీ కొట్టిపారేసినారు. టెలిఫోను తీగల్ని తెంచిపారేసినా బయింలేకుండా పెద్ద అలారంబెల్లు ఏర్పాటుచెయ్యించినారు రెయ్యంతా మీరిద్దరూ కాపలాపడుంటారు. ఇద్దరు పోలీసోళ్లు వస్తారు దూటీకి. పోలీసుజీబు రేత్తుల్లో వొకటికి రెండుసార్లు వచ్చిపోతానే వుంటాది. చీమాదోమా గూడా లోపలికి పొయ్యే దోవ లేదు. ఇంక బయమెందుకు ..." అన్నాడు సంజీవి నవ్వుతూ.

"పోయిన తడవ ఇక్కడ దొంగతనం జరిగినప్పుడు వారందినాలదాంకా జైల్లో కుర్చోని వచ్చినావు. నెలదినాలు రొయాస్పత్రిలో మందు తిన్నాంక కూడా లోదెబ్బలు తగ్గకుండా అగోరించినావు, యెవురికుండాల బయం? నీకా, నాకా?" అంటూ సుబ్బయ్య హుంకరించాడు.

"మాటాడేదానికేముండాదిలేన్నా! ఎట్లయినా మాట్లాడచ్చు. నోటికేమయినా తలుపా, దాలబంధరమా? నాలుక్కు ఏమికేదుండాదిలే!..." తమాషా వాగ్వివాదానికి దిగేశాడు సంజీవి. "ఏందో దోవను బొయ్యేవాడు, అతీగతీ ఎవుడూ చూడల్లే అని వుత్తివున్యానికి టేషనుకు తోస్తిరి మీరంతా కలుసుకోని. రొండుమూడు నెల్లకు ముందు పోలీసులు అసలు దొంగల్ని పట్టేసినారనీ, పోయిన నగానట్రా అంతా పెద్దరెడ్డికి జేరిపోయిందనీ నువ్వేగదా చెప్పినావు. కాయకష్టం జేసుకోని బతికేటోళ్లం. మమ్మల్ని కష్టబాధలూ పెడితిరిగదా? బగమంతుడు వోరస్తాడా ఇదంతా?"

"అందుకేరా పిచ్చివుల్లయ్యా! నీకు ఇలావిరిగాజెప్తావుండాన్నేను. ఏదబొయ్యి ఏమొచ్చినా ముందుగా ఏటుబడేది నీపైన్నేగదా? అందుకనే ఏమారకుండా కాపెట్టుకోమండాల. ఏనుగులు పైనబడినా లెయ్యకుండా ఈ మాదిరిగా నిద్రపోతే గుణం లేదు"

"ఈస్వరుడెట్ల రాసిపెట్టుంటే అట్ల జరగతాదన్నా! కాలం గాకపోతే కొయ్యే పామై కరస్తాది. లేకపోతే తప్పంతా మాదేనని ముందుగా పోనిడిమాటలు జెప్పింది నువ్వేగదా? పోలీసల్తో సాక్షికం జెప్పింది కూడా నువ్వేగదా? ఇప్పుడేమో నబ్బక్కమాటలు జెప్తావుండావుగానీ ..."

"మేస్త్రీని పట్టుకోని వాచ్‌మేనుద్దోగం కొట్టుకోనిపోయినట్లనుకుంటివారా? ఇల్లలకంగానే పండగయిపోతిందారా బాడకోవ్! గుణాతం ఎయ్యకముందునించీ, బోరింగేసినప్పటినించీ ఇక్కడ్నే కాపెట్టుకోనునింది నేను! మద్దెలోవచ్చిన నీకు వాచ్‌మేనుద్దోగమా? ఇది మాత్రం న్యాయంగా వుండాదా నీకు?" ప్రసాదరెడ్డి బంగళావైపు కోపంగా చూస్తూ సుబ్బయ్య బీడీ వెలిగించాడు.

"మట్టిపనిజేసేది మాకు కులవృత్తి గదన్నా! మీ బలిజోళ్లకు అదెట్ల వల్లపడితింది? మా వోళ్లంతా వాచ్‌మేనుద్దోగాలకు ఎత్తిన చెయ్యి. పనిదెలిసిన మమ్మల్ని పనిలో పెట్టుకుంటారా? కరిణిచేతబట్టేదిగూడా రాని నిన్ను పనిలో

జేర్చుకుంటారా? ఈ యవ్వారం మనుసులో పెట్టుకోని, పుత్తిపుణ్యానికి నామింద నిందేస్తివిగదా! పుట్టి ఈ గడ్డపైన పడినకాడినించీ ఎన్ని పనులు చేసుంటాను. యాడైనా ఏలెత్తి చూపించుకోమంటివా నేను? గంగమ్మ గుడికాడ సుందరామిరెడ్డి నాలుగంతస్తుల మహాడీ గట్టించినప్పుడు నేనేగదా వాచ్‌మేను! దమ్మిడీ సొత్తు లెక్క తప్పొయ్యిన్నా? నా సంగతి పాపులర్ యేజెన్సీస్ రంగసామి నడుగు. బైరాగి పట్టెడ రాజగోపాలనాయుడు నడుగు. నీ మూలాన నిందమొయ్యాల్సి వచ్చిందిగదా! పోలీసుల్తో అబద్ధం చెప్పేదానికి మనసెట్ల వచ్చిందన్నా నీకు?" అంటూ సంజీవి నిలదీసి ప్రశ్నించాడు.

"నాకంతా తెలుసులేరా సంజీవీ! ఆ పొద్దు కొంచెం నీళ్లు ఎక్కువై వుంటాయిలే!" అంటూ సుబ్బయ్య గొంతుక తగ్గించి "అది సరేగానీ, బంగాకుందాదా?" అని ప్రశ్నించాడు.

సంజీవి అతడినోమారు పైకీ కిందికీ చూసి, నవ్వడానికి ప్రయత్నించి, విఫలుడైపోతూ లేదన్నట్టుగా పెదవి విరిచేశాడు.

సుబ్బయ్య కోపంగా వురిమిచూస్తూ బీడీని వేగంగా బయటికి విసిరాడు. అంతకంటే వేగంగా వీస్తున్న ఈదురుగాలికి బీడీముక్క లోపలికే తిరిగొచ్చి అతడిపైనే పడింది.

చిట్లతున్న చిన్న చిన్న డైనమెట్లలాంటి చినుకులు నేలపైని ధూళిపొరల్ని చిందరవందర జేస్తున్నాయి. రోగుల్లా జుట్టువిరబోసుకుని నిల్చున్న చెట్లన్నీ అయోమయంగా వీస్తున్న గాలి తాకిడికి అలిసిపోయినట్టుగా కనిపిస్తున్నాయి. ఆకాశంలో మెరుపులు ప్రాకినప్పుడల్లా నిద్రలో వులిక్కిపడి మేల్కొన్న ముసలావిడ ముఖంలో తారాడే నీలినీడల్లా, ఆ ప్రాంతమంతా వెలుతురు తెరలు ప్రాకుతున్నాయి. దగ్గర్లో ఎక్కడో భీకరంగా శబ్దం చేస్తూ పడిన పిడుగు, బహుశా భూమిని రెండుగా చీల్చిపారేసినట్టుగా తోస్తోంది.

"టీ కావాలా సంజీవీ!" అన్నాడు సుబ్బయ్య వొళ్లు విరుచుకుని ఆవులిస్తూ.

సంజీవి ఉలిక్కిపడి తలపైకెత్తి "ఇప్పుడా?" అన్నాడు విసుగ్గా.

"ఈదురుగాలికి వొళ్లంతా ఎట్టెట్టో అయిపోయింది. వుడుకునీళ్లు పడితేగానీ బండి కదలదు. అప్పటినించీ దొంగనిద్దర్లో వుండాది నీ పెండ్లాం. కొంచెం పైకి లెయ్యమను చినుకుల్లో నాలుగడుగులు సారిస్తే నెత్తిపైన మొలకేమీ రాదుగానీలే!" అంటూ సుబ్బయ్య జేబుల్లో బీడీముక్కేమైనా మిగిలిందేమోనని గాలించసాగాడు.

"ఎంత పెద్దరెడ్డి చెప్పినాడే అనుకో, ఈ వానాగాలిలో టీడేచ్చేదానికి ఆడమనిషి వల్లయితిందా?" అన్నాడు సంజీవి జీరబోతున్న గొంతుతో.

"పోనీ, నువ్వే బయల్దేరు..." అంటూ ఫ్లాస్కును చూపెట్టాడు సుబ్బయ్య.

"చీకట్లోకి పొయ్యేదానికి నాకువల్లపడదని నీకు తెలవదా? పైగా ఆడమనిషిని వొంటిగా వొదిలిపెట్టి నేనెట్లా పొయ్యేది?"

"మొబ్బంటే బయపడేవాడివి నువ్వేం వాచ్‌మేన్‌రా? నీ పెండ్లానికి నేను తోడుండ్లేదా ..."


ఎవరో ఎత్తికుదేసినట్టుగా సంజీవి నిలువునా వూగిపోసాగాడు. అంత చలిగాలిలోనూ అతడికి చెమటలు పట్టసాగాయి. పెదవులు వణుకుతుండగా అతడు గోడపైకి సోలిపోయాడు.

"నీ పెండ్లాన్నేమైనా కొరుక్కోని తినేస్తానా నేను? ఏం పర్వాలేదులే? ఆ పెట్రోలుబంకు కాడుండే టీహోటలుకాడికి పొయ్యొచ్చేదానికెంతసేపు పడితింది? ..."

"గొడుగు లేదు. మూనె కాగితంగానీ, గోతంగుడ్డగానీ లేదు. ఈ వానలో పొయ్యేదానికి నావల్ల ఎట్లయితిందన్నా!" ఏడుపు ముంచుకొస్తుండగా సంజీవి ప్రాధేయపడసాగాడు.

"సరే! రేప్పొద్దన రెడ్డికామాటే చెప్ప..." అన్నాడు సుబ్బయ్య ముక్తసరిగా.

అటువైపుకు తిరిగి పడుకున్న భార్యను కుదపసాగాడు సంజీవి. ఆమె బలవంతంగా కళ్లు తెరిచి "గొమ్మునుండు ..." అంటూ వణికి మరోవైపుకు దొర్లుకుంది.




"థూత్తెరీ, వద్దినాయాలా!" బండబూతులు దొర్లుతుండగా సుబ్బయ్య వీరంగం దొక్కసాగాడు. "రెండు గుక్కలు టీనీళ్లు తెచ్చేవగలేదు. నీకెందుకురా వుద్యోగం? అణవరించుకోను చేతగానోడివి, నీకెందుకురా పెండ్లాము? నీ పెండ్లాన్నెవురూ మింగెయ్యరు. నడువు బయటికి? ఈడున్నట్టుగా రావాల ... కదులు ముందుకు ..."

అదురులో నడుస్తున్నట్టుగా పాదాల్ని బలవంతంగా కదుపుతూ ఫ్లాస్కు చేతికందుకుని కదప ముందుకు నడచాడు సంజీవి. గులకరాళ్లంత పెద్దవైన వడగండ్లు మిస్సైల్స్‌లా అతడిపైకి దూసుకొచ్చాయి. తడిసిన పిల్లిపిల్లిలా ముడుచుకుపోతూ రోడ్డువైపుకు కలయజూశాడతను. చీకటి, చినుకులు, వడగండ్లు, ఈదురుగాలులు కలిసి నేసిన చిక్కటి తీవాచీని రెండుగా కత్తిరిస్తున్నట్టున్న వొంటరి దీపమొకటి ఇంటివైపుకు మెల్లగా పరతెంచి వస్తోంది. దీపం మరికొస్త దగ్గరికి రాగానే కీచురాళ్ల కోరస్‌లా గంట గణగణా మోగింది. ఆగిన సైకిలుపైనుంచీ కిందికి గెంతి "ఈ వానలో యాడికిరా సంజీవీ?" అని అడుగుతూ సైకిలునలాగే అవతలగా పైకెత్తి, ఇంటిలోపలికెత్తుకొచ్చి, గోడపక్కన నిలబెట్టేశాడు తయారుదిగ మునిరత్నంనాయుడు.

"చేతిలో ఫ్లాస్కు గనబడ్డేదా?" అంటూ సుబ్బయ్య నిష్ఠూరపోయాడు.

"ఆ పెట్రోలుబంకు కాడుండే అంగళ్లన్నీ మూసేసినారు. గుడిసెండ్ల కవ్వలన్నీ కొట్టుకొనిపోయినాయి. ఆ పక్క బ్యాటరీలేసుకోని ఎతికినా పరవురుగు కనబడదు" అని నవ్వుతూ మునిరత్నంనాయుడు కుక్కిమంచంపైని పాతగుడ్డనొకదాన్ని చేతికందుకుని తలతుడుచుకోసాగాడు.

సుబ్బయ్య మూతిముడుచుకుని "ఈ వానా వంగుడులో పడీ లేచీ రాకపోతే నీగందేంపోయింది? కొంచుంగాలావానా తగ్గినాంక రాకూడదా?" అని కసురుకున్నాడు.

అతడి మాటలు చెవినబడనట్టుగా మంచందగ్గరికి నడచి, "ఈ పొద్దు బిర్యానీ తెచ్చిపెట్టినావా సంజీవీ నీ పెండ్లానికి? ఇంత వానలోగూడా దిక్కులు దెలియకుండా నిద్రపోతా వుంది!" అంటూ కిసుక్కుమన్నాడు మునిరత్నంనాయుడు.

ఎప్పుడో నిద్రలేచిన వ్యక్తిలా లేచికూర్చుని "నువ్విచ్చిన దుడ్డు గుడ్లు పెడతావుండాయని, బిర్యానీ తెచ్చుకోని తిన్నాములే!" అంది మూలస్థానమ్మ.

"ఇప్పుడు తింటావా చెప్ప, రేయ్ సంజీవీ! బిర్యానీ పొట్లం తీసకరాపో" అంటూ మునిరత్నంనాయుడు యాభైరూపాయిల నోటు పైకితీసి రెపరెపలాడించాడు.

— మిగతా వచ్చేవారం